51

# రూపాయిస్తే మెరుపు మెరిస్తే

**"నా** చదువుకూ, నేను చేస్తున్న పనికీ ఏమీ సంబంధం లేదని మీరు అంటున్నారు. ఉన్నదని నేనంటున్నాను" అన్నాడు శామ్యూలు ఆనందరావు హాయిగా నవ్వుతూ.

అప్పటికే ఎండ మిటమిటలాడి పోతున్నది. ముగురు కాలువ మీది దోమలు జుమ్మని తుగిడీలు తుగిడీలుగా లేచి, కాసేపు అటూ ఇటూ తచ్చాడి మళ్ళా కాలవమీదనే వాలి విశ్రాంతి తీసుకుంటున్నాయి.

చేతి వేళ్ళను ఒకసారి విరుచుకుని, పెటపెటలాడించి కుదురుగా కూర్చున్నాడు శామ్యూలు ఆనందరావు.

"నేను 'జీవన సమరం' చూస్తున్నాను. చదవడం లేదనుకోకండి. చదువుతున్నాను. బతుకులో ఎంత వైవిధ్యం ఉన్నదీ, బతకడం కోసం మనిషి ఎన్నిపాట్లు పడుతున్నదీ చెబుతున్నారు. వాటినన్నింటినీ నేను ఆప్యాయంగా దాచుకున్నానంటే మీరు నమ్ముతారా? ఓసారి మా ఇంటికి రండి... చూపించుతాను అదే! ఏదో ఒకనాటికి నేనూ ఇందులో చోటు చేసుకోవలసి వస్తుంది, నేను అనుకోలేదు సుమండీ!" అన్నాడు శామ్యూల్.

అతని పూర్వీకులు హిందువులేనట. ముత్తాతగారో, ఆయన నాన్నగారోగానీ, 'మతం' పుచ్చుకున్నారట. అంతదాకా, తమకు చదువన్నదే లేదట.

"మా తాతగారు రైల్వేలో పనిచేశారు. అట్టే పెద్ద ఉద్యోగమేమీ కాదు. ఓ గేటు దగ్గర కాపలాదారు. రైలు రావడానికి ముందు గేటు వేసేవారు. పచ్చ జెండా చూపించేవారు. రైలు పోగానే గేటు తీసేవారు. ఆయనకు ఆరుగురు పిల్లలు. మా నాన్న పెద్దవారు. అందరూ అంతో ఇంతో చదువుకున్నవారు! ముగ్గురు చిన్నాన్నలు స్కూలు మాస్టర్లుగా పనిచేశారు. ఇద్దరు చిన్నాన్నలు మత ప్రచారకులుగా పనిచేశారు. మా నాన్న ఆ రోజుల్లోనే స్కూల్ ఫైనలు ప్యాసయ్యాడండి! అప్పట్లో దొరలదే కదండి రాజ్యం. జిల్లా కలెక్టరుగా ఒక దొరగారుండేవారు. ఆ దొరగారికి మా నాన్నగారంటే చాలా ఇష్టం. ఆ ఇష్టానికి కారణం కూడా చెప్పనా? మా నాన్నది చక్కని గొంతు క్రైస్తవ భక్తి గీతాలను చాలా బాగా పడేవారు. ఆ పాటకోసం ఎంతో మంది మా యింటికి వస్తూండేవారట. దొరగారికి ఈ సంగతి తెలిసి మా నాన్నను పిలిపించుకొని పాడించుకున్నారట. అప్పటి నుండి మా న్నాగారు తీరిక దొరికినప్పుడల్లా కలెక్టరుగారి బంగళాకు వెళ్ళి పాటలు పాడుతూ ఉండేవాడట. ఇలా కొంత కాలం గడిచింది. ఆ దొరగారికి మద్రాసుకు బదిలీ అయింది. ఆయన పోతూ పోతూ మా నాన్నకు పోలీసు శాఖలో ఉద్యోగం ఇచ్చి మరీ వెళ్ళాడు"అన్నాడు శామ్యూలు ఆనందరావు.

"మా నాన్న పోలీసు ఉద్యోగానికి పనికొచ్చే మనిషి కాదండి!" అని వ్యాఖ్యానించాడు శామ్యూల్ ఆనందరావు.

"ఆయన పరమ భక్తుడు. ఉద్యోగం నుంచి వచ్చాక ప్రార్థనలు, భజనలు చేస్తూ ఉండేవారు. దిక్కూమొక్కూలేని వారిని చేరదీసి చదువు చెబుతుండేవాడు. అప్పుడప్పుడూ, అనాథ బాలలను ఇంటికి తీసుకొని వస్తూ ఉండేవాడు. మరియమ్మకూడా ఏమీ అనేదికాదు. పైగా, ఈ అనాథ బాలల్ని

కడుపులో పెట్టుకొని సాకేది. పావలా, బేడా, అణా ఎంతవుంటే అంత వారికిచ్చి పంపుతుండేది".

"ఇవన్నీ చెడ్డపనులనీ, నేను అననుగానండీ! కాస్త వెనకాముందూ చూసుకోవాలంటాను. మా నాన్న ఆ పనిచేయలేదు. ఆయనతో పాటు ఉద్యోగాల్లోచేరిన వాళ్ళు బాగా సంపాదించుకున్నారు. ఆయనకు ఆ పెన్షన్ తప్ప మిగిలిందేమీ లేదు. మీరు నన్ను క్షమించాలి. మా నాన్నను విమర్శించడంలేదు. నా సంగతికొస్తున్నాను. మేము అన్నదమ్ములం, అక్కచెల్లెళ్లం కలిపి ఎనమండుగురం. మా పెద్దన్నయ్య టీచర్. రెండోవాడు, మూడోవాడు మతప్రచారం చేస్తున్నారు. మగవాళ్ళలో నేనే ఆఖరువాణ్ని. మా అక్కయ్య ఇద్దరు పిల్లల్ని కని చనిపోయింది. ముగ్గురు చెల్లెళు ్లు. అందులో ఇద్దరు నర్సులుగా పనిచేస్తున్నారు. ఆఖరు చెల్లి ఇంకా చదువుకుంటున్నది. మా చదువులకు మా నాన్న చెల్లించింది దాదాపుగా ఏమీ లేదండీ. నా మట్టుకు నా చదువు అంతా స్కాలర్ షిప్‌మీదనే లాగించేశాను. మిగిలిన వారికి మా మత సంస్థలు సహాయం చేశాయి. నాకూ అలాంటి సహాయం దొరికిందనుకోండి. నేను యమ్మే కూడా చదువుదామనుకున్నాను. కానీ బియ్యే పూర్తి చేసేసరికి పెటపెటలాడిపోయింది. ఉద్యోగం చేసుకుంటూ చదువుకుందామని సరిపెట్టుకున్నాను. ఉద్యోగం కోసం నేనెన్ని ప్రయత్నాలు చేశానో చెబితే మీరు ఆశ్చర్యపోతారు. చాలా వాటికి దరఖాస్తు చేశాను. రిటెన్ ఎగ్జామినేషన్‌లో పాసయ్యేవాడిని, ఇంటర్వ్యూలో తప్పానేవాళ్లు. ఇదంతా పెద్ద ఫార్సు సార్! ఇంటర్వ్యూలో వాళ్ళు అడిగిన ప్రశ్నలన్నింటికి ఠంచనుగా సమాధానం చెప్పేవాడిని. అయినా తప్పిపోయావంటారు. ఇదెలా సాధ్యమో నాకు చచ్చినా అర్థం కావడం లేదు. ఓ చిన్న ఉదాహరణ చెబుతాను. 1977 జూన్‌లో ఒక బ్యాంకువారు, ఫలానా ఫలానా ఉద్యోగాలకు దరఖాస్తులు కావాలన్నారు. రాదని తెలిసి కూడా అప్లయి చేశాను. అంతా మామూలుగానే రిటెన్ ఎగ్జిమినేషన్‌లో మంచి మార్కులతో పాసు అయ్యాను. ఇంటర్వ్యూకు ముందో 'పెద్ద మనిషి' నా దగ్గరకొచ్చాడు. ఐదు వేలు ఖర్చు చేస్తే ఆ ఉద్యోగం ఖచ్చితంగా ఇప్పిస్తానన్నాడు. నా దగ్గర అంత డబ్బులేదు. నాతో బాటు ఆ తరహా ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన ఇద్దరు అతనడిగినదంతా యిచ్చి, ఆ ఉద్యోగాల్లో చేరిపోయారు. నేనేమో ఆ ఉద్యోగుల వాచీలకు మెరుగు పెడుతూ బతుకుతున్నాను" అన్నాడు. ఆనందరావు దిగులుగా.

"నేను చదివిన చదువుకూ, నేను చేస్తున్న పనికీ సంబంధం లేదని మీరు ఆనకండి. సంబంధం ఉన్నదని నా అభిప్రాయం. ఈ దేశంలో చదువుకున్న వాడికి బతుకు తెరువు లేదు. ఈపాటి గడియారాల మెరుగు పని కోసం అన్ని సంవత్సరాలు చదవడం శుద్ధ దండగ, మీరు సంస్కారం అబ్బింది గదా అంటున్నారు. కాలే కడుపుకి పిడికెడు అన్నం పెట్టలేని సంస్కారాన్ని తగలెయ్యాలిగాని మెచ్చుకుంటారేమిటి?" అన్నాడు ఆనందరావు.

ఈ పని చేస్తున్నందుకు ముందుగా కాస్త అభిమానపడిన మాట నిజమేనన్నాడు. ఇప్పుడు తనకా అభిమానం లేదన్నాడు. తనను చూసి మిగిలినవాళ్లు సిగ్గుపడాలిగాని తనుగా సిగ్గుపడవలసిందేమీలేదన్నాడు.

"వాచీకి పై మెరుగు పెడితే ఒక్కరూపాయి తీసుకుంటాను. అద్దం మాత్రం మెరుగుపెట్టాలంటే 75 పైసలు తీసుకుంటాను. అంటే అద్దం ఊడదీసి, పైనా లోతట్టునా 'బఫ్' చేస్తానండి. అద్దమూ

వాచీకి అడుగునా చుట్టూరా మెరుగు పెట్టాలంటే, రూపాయిన్నరా, రెండు రూపాయలూ తీసుకుంటాను. రోజుకు పదీ, పన్నెండు రూపాయలు దొరుకుతాయి. ఒక్కోసారి 15 కూడా దొరుకుతాయి. రెండు మూడు దొరకని రోజులూ ఉన్నాయి. సామానంతా ఈ పెట్టెలో సర్దుకుని మడతబల్లను భుజానికి తగిలించుకొని ఎక్కడికి కావాలంటే అక్కడికే వెళతాను. కానీ, వూరంతా తిరగవలసిన అవసరం ఎప్పుడోగానీ రాదు. నాకు ఈ పనే హాయిగా వుంది. కష్టంకొద్దీ ఆదాయం''. అన్నాడు శామ్యూలు ఆనందరావు.

అతనికింకా పెళ్ళికాలేదు. ఇప్పుడే చేసుకోవాలని కూడా లేదట. తన చెల్లెళ్లకు సంబంధాలు చూస్తున్నానని, కుదిరితే ఈ నెలాఖరులోగా చేసేస్తానని అన్నాడు.

''మా గొడవలు మాకు ఉన్నాయండీ! మాది వెస్లీ చర్చి. ఈ చర్చికి చెందినవాళ్ళే దొరకాలి. వారికి మా చెల్లెళ్లు నచ్చాలి. అంత కన్నా ముఖ్యం మా చెల్లెళ్లకు వాళ్ళూ నచ్చాలి. ఇవిగాక డబ్బుదస్కం ఇతర ఖర్చులు ఇవిగో ఇన్ని ఉన్నాయి'' అన్నాడు శామ్యూల్ ఆనందరావు తన చింపిరి జుట్టును చూపుతూ.